ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఎర్ర కాలువ ఉగ్రరూపం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఎర్రకాలువ ఉగ్రరూపానికి పరివాహన తొమ్మిది గ్రామాలు విలవిల లాడుతున్నాయి. మండలంలో 900 ఎకరాలు ఎర్రకాలువ ముంపునకు గురి కాగా మూడు గ్రామాలు వరద నీటితో ఇబ్బందులు పడుతున్నాయి. పంట బోదెల మురుగు బయటకు వెళ్లని కారణంగా పది వేల ఎకరాల పంట నీట మునిగింది. తాడేపల్లిగూడెంలోని జగన్నాధపురం, నంద మూరు గ్రామాలలో వరద ముప్పుకు గురైన బాధితుల ను పునరావాస కేంద్రాలకు తరలించి అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. నందమూరు అక్విడెట్ వద్ద ఎర్ర కాలువ నీరు మొత్తం రికార్డుస్థాయిలో 38 అడుగులకు చేరుకుంది. అయినా ఎగువ ఇంకా వర్షాలు కురుస్తుం డటంతో ఈ కాలువ పరీవాహక గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి.



తాడేపల్లిగూడెం : నందమూరు వద్ద ఎర్ర కాలువ ఉధృతికి నిలువెత్తు లోతు నీటిలో మునిగిన వరి పొలాలు



- నందమూరుకు చెందిన బల్లపూడి సర్వేశ్వరరావు తొమ్మిది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరినాట్లు వేశారు. ఆకుమడి వేసేందుకు ఎకరానికి రూ.1,000, ఆకుమడి, ఎరువులకు రూ.500, నాట్లకు రూ.4 వేలు, దమ్ముకు రూ.1.500, నాట్లు తర్వాత ఎరువుకు రూ.1,500, గట్లు లంకలకు రూ.1,000 ఇలా మొత్తం ఎకరానికి రూ.9 వేలు ఖర్చయ్యింది. తొమ్మిది ఎకరాలకు చేసిన ఖర్చు రూ.85,500 ఎర్రకాలువ నీటిలో కొట్టుకుపోయింది. ఈ కౌలు రైతు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.



- నందమూరుకే చెందిన చెందిన కొప్పినేటి నాగేశ్వరావు 12 ఎకరాలు కౌలు కు తీసుకుని సాగు నిమిత్తం ఇప్పటి వరకు అప్పు చేసి రూ.1,13,000 పెట్టుబడి పెట్టాడు. గత ప్రభుత్వం దాళ్వాకు చెల్లించాల్సిన ధాన్యం సొమ్ము నేటికి అందకపోవడంతో ఇతని పరిస్థితి అగమ్యగోచంగా మారింది.

- నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నా. ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టి నాట్లు వేశా. బోడపాడు డ్రెయిన్ నుంచి నీరు వెళ్లని కారణంగా పొలం మునిగిపోయి వేసిన నాట్లన్నీ కుళ్ళిపోయాయి. నారుమడి కొని మళ్లీ నాట్లు వేయాలి. ప్రభుత్వం ఆదుకోవాలి.



- వివివి సత్యనారాయణ, కౌలు రైతు, రావిపాడు

వైసీపీ పాపం
ముంచేసింది

స్తంభించిన డ్రెయిన్‌లు.. మునిగిన పంట పొలాలు.. జిల్లాలో అపార నష్టం.. అంచనాల్లో అధికారులు

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డ్రెయిన్‌లు స్తంభించాయి. నీటి ప్రవాహానికి అవరోధంగా మారడంతో పంట పొలాలు ముంపుబారిన పడి చెరువులను తలపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాల పాప ఫలితంగానే రైతులకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లాలో సగటున 90 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా తాడేపల్లిగూడెం ప్రాంతంలో నమోదైంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఏకమయ్యాయి. నారుమడులు, వరి నాట్లు దెబ్బ తిన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టినా పంట పొలాల్లో ముంపు అధికంగానే ఉంది. డ్రెయిన్‌ల నుంచి నీటి ప్రవాహం తక్కువగా ఉంది. పైనుంచి పంట పొలాలకు వచ్చి చేరుతున్న నీరు అధికం కావడంతో పంట పొలాల ముంపు తీవ్రత అధికమైంది. ఆదిలోనే రైతులకు పెద్ద మొత్తంలో నష్టం పెట్టింది. ఎకరానికి రూ.10 వేలు పెట్టి నాట్లు వేశారు. అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు నాట్లు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి.

వెంటాడుతున్న వైసీపీ పాపం

డ్రెయిన్లు పూర్తిగా పూడుకుపోవడంతో నష్టం తీవ్రత పెరిగింది. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డ్రెయిన్లలో పిడికెట్టు మట్టి తీయలేదు. జలవనరుల శాఖకు నిధులు కేటాయించలేదు. గుర్రపు డెక్క, తూడు తొలగించలేదు. డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవడంతో తాజాగా కురిసిన వర్షాలకు పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. లేదంటే నష్ట తీవ్రత తగ్గేది. లోతట్టు ప్రాంతా లకే మునక పరిమితమయ్యేది. డ్రెయిన్ల సమస్యతో ఇప్పుడు జిల్లా అంతటా పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. రైతులకు పెద్ద మొత్తంలోనే నష్టం వాటిల్లింది.



ఆచంట : చెత్తతో ముందుకు సాగని తాడేరు డ్రెయిన్ నీరు

తాడేపల్లిగూడెంలో అధికం

మెట్ట ప్రాంతమైన తాడేపల్లిగూడెం మండలంలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. దాదాపు 10,500 ఎక రాలు ముంపులో ఉన్నాయి. ఓ వైపు ఎర్ర కాలువ వరద తో వీరంపాలెం, అప్పారావుపేట, జగన్నాథపురం, మారం పల్లి, మాధవరం, నందమూరు గ్రామాల్లో పంటలు కోల్పో యారు. వరి నాట్లు వేసిన తర్వాతే పంట దెబ్బతింది. ఇంకోవైపు డ్రెయిన్‌లు స్తంభించిపోవడంతో మిగిలిన ప్రాం తాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. గ్రామాల్లోకి వరద నీరు చేరుకుంటోంది. ఏటా వరదొస్తే ఎర్రకాలువ పరివా వాక ప్రాంతంలో నష్టం తీవ్రత అధికంగానే ఉంటోంది. కాలువ వెడల్పు చేసినా ఫలితం లేకుండా పోయింది. గట్లకు గండ్లు మెండుగానే ఉన్నాయి. వాటిని పూడ్చడంలో గత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. మొత్తంపైన డ్రెయిన్‌లు, కాలువల మరమ్మతులను గడచిన ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. వర్షాలు కురిస్తే చాలు పంట పొలాలు ముంపులో పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.13 కోట్లు నిధులు కేటాయించారు. అప్పటికే కాలాతీతమైంది. నష్టమంతా జరిగిపోయింది. మూడు రోజులు కురిసిన వర్షాలు రైతులకు చేదు అనుభవం మిగిల్చాయి.



నందమూరు గ్రామంలోకి వరద నీరు

27,782 ఎకరాల్లో..

ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 2.45 లక్షల ఎకరాల్లో వరి సాగుకు ప్రణాళిక చేశారు. ఇప్పటి వరకు 87,968 ఎకరాల్లో నాట్లు పూర్త య్యాయి. మరో 10,850 ఎకరాలలో నారుమడు లున్నాయి. రైతులంతా నాట్లు వేయడంలో తల మునకలై వున్నారు. మరో పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో నాట్లు వేసే వారు. ఇంతలో వర్షాలు ముంచుకొచ్చి పొలాలన్నీ మునిగిపోయాయి. జిల్లాలో 27,782 ఎకరాల్లో నాట్లు దెబ్బ తిన్నట్టు ప్రాథమిక అంచనా. ఈ విస్తీర్ణం మరింత పెరగనుంది. మరో రెండు రోజులు గడిస్తే పూర్తి స్పష్టత వస్తుంది. 2432 ఎకరాల్లో నారు పూర్తిగా దెబ్బ తిన్నది. మళ్లీ కొత్తగా నారుమడి వేసుకోవాలి. గతంలో వర్షాలు కురిస్తే నారుమడుల నుంచి నీటిని బయటకు తోడేవారు. ఈ ఏడాది ఆ పరి స్థితి లేదు. డ్రెయిన్లు స్తంభించిపోవడంతో బయటకు తోడినా నీరు వెళ్లే మార్గం లేకపోయింది. డ్రెయిన్లలో పూడిక తీయాలంటూ జనవరిలో గత ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపినా పట్టించుకోలేదు. ఆ ఫలితం రైతులు ఇప్పుడు అనుభవిస్తున్నారు.



నరసాపురం : దర్భరేవు మురుగు కాల్వ

ఈ డ్రెయిన్ల కింద భారీ నష్టం

నరసాపురం రూరల్: నరసాపురం మండలం దర్భ రేవు, రుస్తుంబాద, నత్తలావ డ్రెయిన్లను ఆధునీకీకరిం చకపోవడంతో రైతులు ఏటా వందల ఎకరాల పంటలను నష్టపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ డ్రెయిన్లలో తూడు, గుర్రపు డెక్కను తొలగించలేదు. ఈ కార ణంగా మురుగుకాల్వల వెంబడి సాగు చేసే రైతులు సాగు ఆరంభంలోనే వర్షాలు, వరదలకు నష్టపో తున్నారు. డ్రెయిన్లను బాగు చేయాలని ప్రజా సంఘాలు, రైతులు ఎన్ని విన్నపాలు ఇచ్చినా, ఎన్ని ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. దర్భరేవు మురుగుకాల్వ వెంబడి మోడీ, చామకూరిపాలెం, ఎల్‌బీ చర్ల, రామన్నపాలెం తదితర గ్రామాల్లోని మూడు వేల ఎకరాలకు పైగా రైతు లు సాగు చేస్తున్నారు. రుస్తుంబాద మురుగు కాల్వ వెం బడి రుస్తుంబాద, సీతారాంపురం, కొప్పర్రు, మంగళకుం టపాలెం, చినమామిడిపల్లి రైతులు సాగు చేస్తున్నారు. నత్తలావ డ్రెయిన్ పరిధిలో సరిపల్లి, లిఖితపూడి, మల్లవరం, మల్లవరంలంక గ్రామాల్లో సాగు చేస్తున్నారు. కాల్వలను ఆధునీకరించకపోవడం వల్ల ఈ సారి కురిసిన భారీ వర్షాలకు పొలాలన్నీ నీట మునిగాయి.

అధికారులు అప్రమత్తం : కలెక్టర్

భీమవరంటౌన్, జూలై 20 : వర్షాల కారనంగా ప్రజల కు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవా లని రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, ఫైర్, తదితర శాఖల అధికారులను జిల్లా కలె క్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. వరద పరిస్థితు లను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందిం చాలని సూచించారు. పీహెచ్‌సీల్లో అవసరమైన మందు లను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవా లని వైద్యాధికారులకు సూచించారు. బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాల న్నారు. వర్షాల అనంతరం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- **జిల్లాలో కుండపోత**

భీమవరం టౌన్ : జిల్లాలో శనివారం కూడా కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం ఎనిమిదిన్నర వరకు నమోదైన వర్షపాతం వివరాలివి.. తాడేపల్లిగూ డెం 49.4 మి.మీ, పెంటపాడు 48.2, తణుకు 29, అత్తిలి 25.2, గణపవరం 32.4, ఆకివీడు 32, ఉండి 36.6, పాల కోడేరు 32.4, పెనుమంట్ర 35.8, ఇరగవరం 44, పెను గొండ 35.4, ఆచంట 32, పోడూరు 33.2, వీరవాసరం 20.8, భీమవరం 30.2, కాళ్ళ 27.2, మొగల్తూరు 30.4, నరసాపురం 28.6, పాలకొల్లు 51.4, యలమంచిలి 30.4 మి.మీ నమోదైంది.

దెబ్బ తిన్న నారుమడి

నారుమడి వేసినప్పటి నుంచి వర్షాలు కురుస్తుండడంతో నీటిలోనే ఉన్నాయి. రెండు రోజులుగా పూర్తిగా మునిగిపోవడంతో ఇక నారు మడి పూర్తిగా దెబ్బ తింది. మరోసారి వేయాల్సిందే. వర్షం నీరు తగ్గాలంటే 15 రోజులు పడుతుంది. నారు మడి ఆలస్యం అవుతుంది. ఏటా సార్వా ఇలానే ఉంటుంది.

- పెంటపాటి వెంకటేశ్వర రావు, రైతు, తాడేరు






రైతులకు కన్నీరు.. : పెంటపాడు మండలం బి.కొండేపాడు, నరసాపురం మండలం రుస్తుంబాద, వైఎస్ పాలెం, ఆచంటలలో నీట మునిగిన వరి పొలాలు..



నీట మునిగిన యండగండి-ఎస్.కొండేపాడు వంతెన

యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం

గణపవరం/ఉండి, జూలై 20 : ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పోటెత్తడంతో యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చింది. గణపవరం మండలం ఎస్.కొండేపాడు, పిప్పర, కొముట్లపాలెం, కోమర్రు, కేశవరం తదితర పరివాహక గ్రామాల రైతులు, ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. శనివారం యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా పొంగి ప్రవహిం చడంతో ఎస్.కొండేపాడు వద్ద బ్రిటీష్ కాలంనాటి లో లెవిల్ వంతెన మునిగింది. ఎస్.కొండేపాడు ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్.కొండేపాడు గ్రామ ప్రజలకు, గణపవరం, ఉండి మండలాల గ్రామ ప్రజలకు రాకపోకలు తెగిపోయాయి. వంతెనపై నాలుగు అడుగుల నీటి ముంపులో మునిగింది. దీని పక్కనే నూతనంగా వంతెన నిర్మించిన పూర్తికాకపోవడంతో ఈకాజ్‌వే వంతెన వర్షాలకు మునిగిపోయి ప్రజలకు, ప్రయాణీకులకు ఆటంకం ఏర్పడుతుంది. ఈ వంతెనను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు. డ్రెయిన్ మరింత ఉధృతి పెరగడంతో ఎస్.కొండేపాడు గ్రామంలోకి వరద నీరు చేరకుండా ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ, డ్రైనేజీ అధికారులు ఇసుక బస్తాలతో గట్లను పటిష్టం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. యండగండి నుంచి ఘైప వెళ్లే ప్రాంతంలో యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. అధికారులు అక్కడకు వెళ్లే ప్రవహిస్తోన్న తీరును పరిశీలించారు.



తణుకు మండలం దువ్వ కాలనీలో వరద నీరు

వయ్యేరు ఉధృతి.. ముంపులో ఇళ్లు

తణుకు : భారీ వర్షాలకు దువ్వలో వయ్యేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెన అంచులను తాకుతూ నీటి ప్రవాహం ఉంది. అక్విడెక్టు సామర్థ్యం 18 అడుగులు. కాగా ప్రస్తుతం నీటిమట్టం 14.5 అడుగులకు చేరింది. ఈ కారణంగా కాలువ గట్టును ఆనుకుని వున్న 44 గుడిసెలు నీట మునిగాయి. ఈ కుటుంబాల వారికి స్థానికంగా వున్న కమ్యూనిటీ హాలుకు తరలించారు. ఆయా కుటుంబాలకు భోజన, వసతి సౌకర్యాలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఏర్పాటుచేశారు. మరోవైపు ఎర్ర కాలువ ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల 1,250 ఎకరాలు ముని గినట్లు అధికారులు చెబుతున్నారు. శనివారం వరద మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. కాలువ గట్లు లీకేజీలు లేకుండా చర్యలు తీసు కుంటున్నారు. అవసమైన ఇసుక బస్తాలు సిద్ధం చేశారు.

దువ్వ మాంచారమ్మ ఆలయం వద్ద ఉన్న కాలనీలోకి వరద నీరు చేరింది. గ్రామంలో మురుగు నీరు వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన కాలువకు అనుసంధానంగా ఎర్ర కాలువ ఉంటుంది. ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో ఈ నీరు మురుగు కాలువలోకి చేరి కాలనీలోకి వరద నీరుచేరింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కాలనీ వాసులు బయటకు రావడానికి, ఇంటిలోకి వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో టీడీపీ హయాంతో పక్కా కాలువ నిర్మాణానికి ప్రతిపాదించారు. అవి మంజూరయ్యే సమయంలో ప్రభుత్వం మారింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం దృష్టి పెట్టకపోవడం వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు.



నత్తారామేశ్వరంలోని స్వామి, అమ్మ వారి ఆలయాల్లోకి నీరు

రామలింగేశ్వరస్వామి ఆలయంలోకి నీరు

పెనుమంట్ర : భారీ వర్షాలకు పెనుమంట్ర మండలంలో ప్రధాన మురుగు కాల్వలు గోస్తనీ, గొంతేరు, భాగేశ్వరం, పొలమూరు డ్రెయిన్లు పొంగడంతో పల్లపు భూములు నీట మునిగాయి. ఇప్పటికే పొలమూరు బాడవ వరి నాట్లు మునిగిపోయాయి. ఎస్.ఇల్లిందరపర్రు, మల్లిపూడి, జుత్తిగ, నత్తా రామేశ్వరం, మాముడూరు, ఆలమూరు, కొయ్యేటిపాడు, ఓదూరు మురుగు కాలువలను అనుకుని ఉన్న ఆయకట్టు భూములు వారం రోజులుగా ముంపునకు గురయ్యాయి. దీంతో 1,200 ఎకరాల నారుమడులు, 600 ఎకరాల నారుమడులు ముంపునకు గురయ్యాయని ప్రాథమిక అంచనా. గోస్తానీ నదిలో కిక్కిస పెరిగిపోవడంతో ఎగువ నుంచి వచ్చిన మురుగు దిగువకు వెళ్లకపోవడంతో నీరు పోటెత్తి నత్తా రామేశ్వరంలోని శ్రీ రామేశ్వరస్వామి ఆలయం వరద నీటిలో మునిగి పోయింది. స్వామి వారి అమ్మవారి ఆలయాల్లో గర్భ గుడిలోకి వరద నీరు వచ్చి చేరింది.

జనజీవనం అస్తవ్యస్తం

ఫుట్ పాత్ వ్యాపారాలు బంద్.. పనులు లేక భవన నిర్మాణ, వ్యవసాయ కార్మికుల ఆవేదన

పాలకొల్లు, జూలై 20:వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురవ డంతో సామాన్య పౌరుల జీవనం అస్తవ్యస్తమైంది. రోజువారీ కూలీ పనికి వెళ్లే కార్మికులు పనులు లేక పస్తులుండే పరిస్థితి ఏర్పడింది. 50 శాతంపైగా పంట పొలాలు ముంపునకు గురికావడంతో వ్యవ సాయ పనులకు ఇబ్బందులు వచ్చా యి. ముంపునీరు తగ్గితే కానీ, వరి నాట్లు ప్రక్రియ ప్రారంభించే అవకాశం లేదు. పట్టణాలు, గ్రామాల్లో రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వర్తకులు వ్యాపారాలు లేక ఆందోళనలో ఉన్నారు. అసంఘటిత రంగంలోని కార్మి కులు, ఎగుమతి దిగుమతులకు వెళ్లే కార్మికులకు పను ల్లేవ్. నిత్యం కూలీ పనిచేసుకుంటూ ఓ వైపు పోషణ, మరోవైపు రోజు వారీ బాకీలు తీర్చుకునే క్రమంలో పను లు లేకపోవడంతో ఇంటిపట్టునే ఉంటున్న కార్మిక కుటుంబాల పరిస్థితి అత్యంత దైన్యంగా ఉంది. భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా ఉచిత ఇసుక పాలసీ అమలు అవుతున్నప్పటికీ ఆచరణ లో అవసరానికి సరిపడా ఇసుక లభిం చక పలు ప్రాంతాలలో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇసుక కరువుకు తోడు భారీ వర్షాలు నిర్మాణ రంగ కార్మికుల ఉసురు తీసాయి. వర్షాల కారణంగా జిల్లాలో నిలిచిన వ్యాపార లావాదేవీలలో సుమారు రూ.100 కోట్ల వరకు నష్టం ఉంటుందని అంచ నా వేస్తున్నారు. జిల్లా నుంచి ఇతర ప్రాం తాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. నిమ్మకాయలు కొనే నాధుడే లేడు. భారీ వర్షాలకు, ఈదురుగాలులకు అరటి తోటలు నేల కొరి గాయి. మరో 10 రోజుల్లో ఆషాడం ముగిసి శ్రావణం వస్తున్నప్పటికీ మార్కెట్‌లో అరటి గెలలు కనుమరుగ య్యాయి. బియ్యం ఎగుమతులు మందగించాయి. వాహనాలలో సరుకు లోడింగ్, అన్ లోడింగ్ పనులకు 5,000 మంది వరకూ కార్మికులు పనులు లేక ఇబ్బం దులు పడుతున్నారు. చిరు వ్యాపారులు, వ్యవసాయ, అసంఘటిత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



పాలకొల్లులో వ్యాపారాలు లేక ఫుట్‌పాత్ వెలవెల

కిరాయిలు లేవు



అసలే రిక్షాలు ఎక్కే వారు తక్కువ. అందు లోను భారీ వర్షాలకు ప్రయాణీకులు రావ డం లేదు. కిరాయి ఉంటేనే మాకు బువ్వ దొరుకుతుంది. లేకుం టే పస్తులే. రోజుకు కనీసం రూ.200 కూడా ఆదాయం రావడం లేదు. కుటుంబం పోషణ భారంగా మారింది.

రేపాక బాబూరావు, రిక్షా కార్మికుడు, పాలకొల్లు

పండ్లు పాడవుతున్నాయి



ఐదు రోజులుగా వర్షాలు తెరిపి లేకుండా కురుస్తుండటంతో మా వ్యాపారం దెబ్బ తింది. పచ్చి కాయల అమ్మకాలు లేకపోవడం, వర్షాల వల్ల పండ్లు పాడవుతుండడంతో ఎవరూ కొనడం లేదు. వాటిని పాడవేయడంతో నష్టాలు వస్తున్నాయి.

- నామన సత్యసాయి, పండ్ల వ్యాపారి, పాలకొల్లు

వీరికి పోస్టింగ్‌లు ఎక్కడ ?

- ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు తిరిగి జిల్లాకు రాక

భీమవరంటౌన్, జూలై 20 : ఎన్నికల ముందు జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్ళిన తహసీల్దార్లు తిరిగి వచ్చేస్తు న్నారు. వారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచే సింది. అయితే వారిని ఎక్కడ నియమించేది జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నిర్ణయం తీసుకోనున్నారు. గతంలో పనిచేసిన తహసిల్దార్ కార్యాలయానికి, లేదా ఇతర మండ లలాకు బదిలీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా ప్రజా ప్రతినిధులు తమకు కావలసిన తహసిల్దార్‌లను నియమిం చాలని ఇప్పటికే సిఫార్సుల లేఖలు ఇచ్చారు. బదిలీపై వచ్చిన తహసిల్దార్‌లు కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేసిన తర్వాతే బదిలీల ప్రక్రియ జరుగుతుంది. వాస్తవంగా ఈ జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లను మూడేళ్లకు మించి పనిచేసినచోటు నుంచి ఎన్నికల అధికారుల ఆదేశాలమేరకు తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, కృష్ణా జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల ముగిసిన తరువాత ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంతో తిరిగి వారంతా ఈ జిల్లాకు వచ్చేస్తున్నారు. జిల్లాకు వచ్చే తహసిల్దార్లలో వైకేవీ అప్పారావు, జీవీ శేషగిరి, ఎంబీ విజయలక్ష్మి, ఎన్.గురుమూ ర్తినాయుడు, ఎం.సునీల్‌కుమార్, ఎస్‌కే హుస్సేన్, ఎస్‌వి సుబ్రహ్మణ్యం, ఆర్వీ కృష్ణారావు, జి.అనిత, జి.పెద్దిరాజు, డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, కుమారి, ఎస్‌డి మౌలానా ఫాజీల్, వై.రవికుమార్, ఏవీ రామాంజనేయులు, ఎన్.వెంకటేశ్వరరా వు, ఎం.రాంబాబు ఉన్నారు.

జిల్లా జేసీ ప్రవీణ్ బదిలీ - 8లో

ఒడిశా దంపతులకు శిశు గృహ బాబు దత్తత


పసిబిడ్డను అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, జూలై 20 : ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన పిల్లల్లేని దంపతులకు ఏలూరు శిశుగృహంలో పెరుగుతున్న మహేష్ అనే మూడు నెలల వయస్సు గల చిన్నారని కేరింగ్స్ ద్వారా రిజర్వ్ చేసుకున్న మీన కీర్తన్‌మహా రాణ, సంధ్యకుమారి మహారాణ దంపతులకు శనివారం కలెక్టర్ క్యాంపు ఆఫీసులో కలెక్టర్ వెట్రిసెల్వి దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకున్న బాబుని మంచి పోషణతో పెంచి విద్యాబోధనలు నేర్పించి వారిని ఉన్నతమైన స్థానంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీవో డాక్టర్ సూర్యచక్రవేణి, శిశుగృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు ప్రత్యామ్నాయాలు చూపండి

» డీఆర్ఎంను కలసిన 'ట్రైన్ మేట్స్ గ్రూపు' ప్రతినిధులు


రైల్వే డీఆర్ఎంను కలిసి ఇబ్బందులను వివరిస్తున్న ట్రైన్ మేట్స్ గ్రూపు ప్రతినిధులు

ఏలూరు అర్బన్, జూలై 20 : ట్రాక్ పనులు, సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునికీకరణల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లను కొన్ని రోజులపాటు పాక్షికంగాను, పూర్తిగాను రద్దు చేయడం, దారి మళ్ళింపులతో ప్రయాణికులు, సీజనర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని 'ట్రైన్ మేట్స్ గ్రూపు' ప్రతినిధులు తెలిపారు. శనివారం విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎన్.ఆనందరావుపాటిల్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. విజయవాడ నుంచి రాజమండ్రి వరకు వున్న పలు స్టేషన్ల నుంచి నిత్యం ప్రయాణించే సుమారు 200 మందితో కూడిన బృందం నుంచి గూగుల్ ఫారంలో సేకరించిన డేటా, సంతకాలతో కూడిన మెమోరాండంను డీఆర్ఎంకు అందజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అభ్యర్థించినట్టు వివరించారు. రైలు నెంబర్లు 12717-12718 రత్నాచల్, 17249-7250 తిరుపతి-కాకినా డ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం పునరుద్ధరించాలని కోరామన్నారు. రైలు ననంబరు 07768 విజయవాడ-రాజమహేంద్రవరంల మధ్య నడిచే మెమూ ఎక్స్‌ప్రెస్ విజయవాడనుంచి బయల్దేరే సమయాన్ని ఉదయం 5.30 నుంచి 6 గంటల మధ్యలో ఉండేలా నిర్ణయం తీసుకుంటే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అభ్యర్థించామని తెలిపారు. ప్రయాణికుల వినతిపై సానుకూలంగా డీఆర్ఎం స్పందించారని ట్రైన్ మేట్స్ గ్రూపు ప్రతినిధి హలీమ్ వివరించారు.


జంగారెడ్డిగూడెంలో వేలం జరుగుతున్న దృశ్యం

పొగాకు @ 400

» రికార్డు ధర పలికిన వర్జీనియా పొగాకు

జంగారెడ్డిగూడెం, జూలై 20 : వర్జీనియా పొగాకు ధర శనివారం రూ.400కి చేరుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వర్జీనియా పొగాకుకు మంచి మార్కెట్ ఉండడంతో పొగాకు ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పొగాకు రైతులు, వేలం కేంద్ర అధికారులు ఎన్నడూ చూడనివిధంగా పొగాకు ధరలు పైపైకి వెళ్తున్నాయి. శనివారం స్థానిక రెండు వేలం కేంద్రాల్లో కిలో పొగాకు ధర రూ.399 ఉండగా గోపాలపురంలో రికార్డు ధర రూ.400 పలికింది. వేలం ప్రారంభమై శనివారానికి 105 రోజులు పూర్తయింది. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో 8.90 మిలియన్ల పొగాకు కొనుగోలు జరిగి టాప్‌లో నిలిచింది. వేలం కేంద్రం-2లో 8.75 మిలియన్లు, కొయ్యలగూడెంలో 8.35 మిలియన్లు, గోపాలపురంలో 7.47 మిలియన్లు, దేవరపల్లిలో 6.82 మిలియన్ల పొగాకు కొనుగోలు జరిగింది.

మామిడి రైతుల సదస్సు స్థలం మార్పు

నూజివీడు టౌన్, జూలై 20: భారీ వర్షాల నేపథ్యంలో మామిడి రైతుల సదస్సును మామిడి పరిశోధన కేంద్రం స్థానంలో బదులు అమర్ భవన్‌లో నిర్వహి స్తామని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు తెలిపారు. సోమవారం సాయంత్రం మూడు గంటల నుంచి అమర్‌భవన్‌లో మామిడి సదస్సును నిర్వహిస్తామని తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 20 : తన భర్త, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ స్థానిక ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన వేములమంద జ్యోతి అనే మహిళ టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన సత్య అనిల్‌కుమార్‌తో ఆమెకు 2010లో వివాహమైంది. వీరి కాపురం కొంతకాలం సజావుగానే సాగింది. ఏడాది కాలంగా భర్త సత్యఅనిల్‌కుమార్, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ శ్రీనివాసులు తెలిపారు.

గోదావరి ఉధృతం


పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి ఉధృతంగా గోదావరిలోకి జలాలు

» పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,78,335 క్యూసెక్కుల వరద జలాలు విడుదల

నిండుకుండలా ఎర్రకాల్వ జలాశయం

పోలవరం/ఆచంట/జంగారెడ్డిగూడెం, జూలై 20 : ఏలూరు జిల్లా పోలవరంలో గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి ఉధృతంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదుల జలాలు.. నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న6,78,335 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.200 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.570 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 30.638 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 20.800 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 35.70 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 3.46 లక్షల క్యూసెక్కుల వరద జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి సోమవారం నాటికి మరో 9 లక్షల క్యూసెక్కుల వరద జలాలు రానున్నట్టు ధవళేశ్వరం బ్యారేజి అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఎగువ కాపర్ డ్యాం బ్యాక్ వాటర్ లెవెల్ పెరిగి కాపర్ డ్యాం కి సమీపంలో ఉన్న గండిపోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి నలువైపులా ఇసుక తిన్నెలు నీటమునిగాయి.

పశ్చిమలో నీట మునిగిన పుష్కర ఘాట్లు


ఆచంట మండలం కోడేరు వద్ద నీట మునిగిన పుష్కర ఘాట్

ఎగువ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం మరింత పెరిగింది. శనివారం ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి మరింత పెరగడంతో మండలంలో ఉన్న అన్ని పుష్కరఘాట్‌లు నీటి మునిగాయి. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పడవలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. వరద పరిస్థితిని రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


పొంగుతున్న కొండవాగులు

పోలవరం మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ వాగులు, రిజర్వాయర్‌లు చెరువులు పొంగి పొర్లుతున్నాయి. శనివారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. గుంజవరం, పేడ్రాల కాల్వలు పొంగుతున్నాయి. కొండవాగుల జలాలు గుంజవరం కల్వర్టుపై నుంచి ప్రవహించాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌లోకి కొండవాగుల జలాలు వచ్చి చేరడంతో రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ సామర్థ్య 90.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో 88.05 టీఎంసీల జలాలు ఉన్నాయని ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అదే నీటిమట్టాన్ని పరిమితిగా చేస్తూ మూడు స్లూయిజ్ గేట్లకుగాను ఒక గేటుని పది సెంటీమీటర్లు పైకి ఎత్తి 250 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఏఈ కొండలరావు తెలిపారు. కొండ వాగుల జలాలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కడమ్మ కాల్వ, కొవ్వాడ కాల్వల్లోకి వరద జలాలు చేరి పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్, కడమ్మ స్లూయిజ్‌ల ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పోలవరం డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్, ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ దేవప్రకాష్, కొవ్వాడ కాలువ రిటైర్డు డీఈఈ సీహెచ్ భాస్కరరావు ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్‌ని పరిశీలించారు. ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్ నీటి విడుదల వల్ల దిగువ ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులు తదితర అంశాలపై పోలీసులు ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తపట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, పోలవరం గూటాల గ్రామాల పరిధిలో నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. మండలంలో 60 ఎకరాల నారుమళ్ళు, 1,462 ఎకరాల వరినాట్లు నీట మునిగినట్లు అధికారులు తెలిపారు.

నిండుకుండలా ఎర్రకాల్వ జలాశయం

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్ర కాలువ జలాశయం నిండు కుండలా మారింది. శనివారం ఉదయం గంటకు 12,525 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. జలాశయం నాలుగు గేట్ల దారా 12,292 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామని ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. సాయంత్రానికి 10,800 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరగా 10,800 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టినట్లు తెలిపారు.

పెరుగుతున్న తమ్మిలేరు జలాశయం



ఏలూరు సిటీ/చింతలపూడి, జూలై 20: చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్ నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియాతోపాటు ఎగువ తెలంగాణ నుంచి వస్తున్న వరద నీరు చేరి శనివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 344.24 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 3,426 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. రెండు రోజుల్లో తొమ్మిది అడుగుల నీరు పెరిగింది. 355 అడుగులకు చేరితే వరద నీరు దిగువకు విడుదల చేస్తారు. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు కాగా ఇప్పటికి 1.337 టీఎంసీలు నీరు చేరిందని ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు. ఇప్పటికే చాట్రాయి మండలంలో తమ్మిలేరు వరద కొనసాగుతోంది. ఎర్రకాలువ కొంత వరకు శాంతించింది. కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు వద్ద నీటిమట్టం 81.88 మీటర్లు కాగా ఎగువ ప్రాంతాల నుంచి 8,655 క్యూసెక్కులు నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతుండడంతో 10,696 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


కొంగువారిగూడెం వద్ద నిండుగా వున్న ఎర్రకాలువ జలాశయం

తరలిపోతున్న ఆ రెండు గ్రామాల ప్రజలు


సామగ్రి తరలిస్తున్న రేపాకగొమ్ము గ్రామస్థులు

వేలేరుపాడు : పెద్ద వాగు వరదలతో అతలాకుతలమైన వేలేరుపాడు మండలం అంతలోనే మరో ఆపదను ఎదుర్కోవాల్సి వచ్చింది. గోదావరి నదికి ఎగువ భాగాన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద పెరుగుతోంది. శనివారం రాత్రికి 36 అడుగులకు చేరువలో ఉన్న నీటిమట్టం ఆదివారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకోవచ్చనే సంకేతాలు తెలంగాణ అధికారులు ఇచ్చారు. దిగువ భాగాన గల వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని ప్రజల్లో ఆందోళన నెలకొంది. వరదపెరిగితే రహదార్లు మూసుకుపోతాయనే భయంతో రేపాకగొమ్ము గ్రామస్థులు దాచారం పునరావాస కాలనీకి తరలిపోతుండగా రుద్రమ్మకోట గ్రామస్థులు బయట ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకపోవడంతో సమీపంలోని గుట్టపైన గుడారాలు వేసుకుని తరలిపోతున్నారు. గోదావరి వరద 50 అడుగుల వరకు పెరిగే అవకాశాలుండడంతో మిగిలిన గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయే ఏర్పాటు చేసుకుంటున్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి : డ్వామా పీడీ

కుక్కునూరు : భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, సెలవులు పెట్టరాదని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రాము ఆదేశించారు. శనివారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖాధికారులు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వరదలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగానే ఏఏ గ్రామాలు ముంపుకు గురవుతాయో ఆ గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. వరద బాధితులకు ఏర్పాటు చేసే భవనాలు, భోజనం వండి పెట్టడానికి బియ్యం నిల్వలు, నిత్యావసరాలు, తాగునీటి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ అచ్యుతకుమారి, ఎంపీడీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

విపత్తు నివారణ దళం సిద్ధం

ఏలూరు క్రైం : ప్రకృతి వైపరీత్యాల సమయంలో విపత్తు నివారణ దళం సభ్యుల సేవలు ప్రముఖమైనవి. ముఖ్యంగా తుఫాన్‌లు, వరదల సమయంలో ప్రాణ నష్టాలను నివారించడంలో వీరి పాత్ర ప్రముఖమైనది. ప్రసుతం గోదావరి వరద ఉధృతి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో వరదలు కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం కలుగకుండా ఉండేందుకు జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు రెండు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు జిల్లాకు వచ్చాయి.

ఎటు పోతున్నాం..

ఉమ్మడి పశ్చిమలో వేర్వేరుచోట్ల మూడు దారుణ హత్యలు

» మంటగలుస్తున్న మానవ సంబంధాలు
» చిన్నపాటి గొడవలకే హత్యలకు దారితీస్తున్న వైనం

క్రైం కార్నర్

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో శనివారం వేర్వేరుచోట్ల మూడు దారుణహత్యలు జరిగాయి. మానవ సంబంధాలను మంటగలిపే విధంగా సొంత కుటుంబ సభ్యులే చిన్నపాటి గొడవలతో హత్యలకు తెగించారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో మామను అల్లుడు ఇనుపరాడ్డుతో కొట్టి చంపాడు. కామవరపుకోట మండలం తడికలపూడిలో మద్యం మత్తుకు బానిసైన కుమారుడు తండ్రిపై దాడి చేసి చంపాడు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం వేములదీవిలో ఓ వ్యక్తిని ఒంటరి మహిళ కత్తితో నరికి చంపింది.

మామను కడతేర్చిన అల్లుడు



లాజర్ మృతదేహం, ఫైల్ ఫొటో


సుబ్బారావు(ఫైల్)

ద్వారకాతిరుమల, జూలై 20: జీవనోపాధి నిమిత్తం ఓ వివాహిత కువైట్‌కు పయనమై వెళ్లడం.. ఆమె తండ్రి ప్రాణానికి ముప్పు తెచ్చిన ఘటన ఐఎస్ జగన్నాథపురంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పాతకోకుల లాజర్(65)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గేదెలు మేపుకుంటూ జీవించే అతడి భార్య గతంలోనే మృతి చెందింది. 20 ఏళ్ల క్రితమే తన పెద్ద కుమార్తె గంగాభవానీని మండలంలోని జికొత్తపల్లికి చెందిన కొక్కిరపాటి సుబ్బారావుకిచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలు. మద్యానికి బానిసైన సుబ్బారావు తరచూ భార్యపిల్లలను కొడుతూ హింసించసాగాడు. వీటిని తట్టుకోలేక ఆమె పిల్లలతో కలసి ఏడాది క్రితమే పుట్టింటికి వచ్చి కూలీపనులు చేసుకుంటోంది. కుటుంబపోషణ నిమిత్తం ఆమె కువైట్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవడం భర్తకు ఇష్టం లేక ఆమెను చంపేందుకు శుక్రవారం రాత్రి పన్నెండు గంటలు దాటిన తర్వాత అత్తారింటికి వెళ్లాడు. అప్పటికే ఆమె జంగారెడ్డిగూడెం వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ బస్సు ఎక్కేసింది. ఇంట్లో ఆమె లేకపోవడంతో ఎక్కడికెళ్లిందని అరుస్తూ చంపేస్తానంటూ కుటుంబసభ్యులను బెదిరించాడు. కువైట్‌కు బయలు దేరిందని తెలుసుకుని.. మామ లాజర్‌ను చంపితే తిరిగి వచ్చేస్తుందని భావించి తనతో తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో లాజర్‌ను కొట్టడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, భీమడోలు సీఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్ అధికారులు, సిబ్బంది సాక్ష్యాలు సేకరించే పనిలో పడ్డారు. మృతుడు కుమారుడు వీరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అతడి కోసం ఇప్పటికే పోలీసు బృందాలు వెదుకులాట ప్రారంభించాయి.

తండ్రిని కడ తేర్చిన కుమారుడు


నాగనబోయిన శ్రీను(ఫైల్)

కామవరపుకోట, జూలై 20 : మద్యం మత్తులో ఓ యువకుడు కన్నతండ్రినే హతమార్చిన సంఘటన శనివారం తడికలపూడిలో చోటు చేసుకుంది. తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపిన వివరాల వివరాలివి.. తడికలపూడి వేంపాడు రోడ్డులో నాగనబోయిన శ్రీను(45), అతడి కుమారుడు కార్తీక్ ఇద్దరూ నివాసం ఉంటున్నారు. శ్రీను భార్య గతంలోనే మృతి చెందింది. శ్రీను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కార్తీక్ అల్లరి చిల్లరగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. తండ్రితో తరచూ ఆస్తి కోసం గొడవలు పడుతున్నాడు. శ్రీను పేర 86 సెంట్ల స్థలం ఉందని, ఆ స్థలాన్ని తనకు రాయాలని తరచూ వేధిస్తున్నాడు. ఈ మేరకు శనివారం శ్రీనుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వేములదీవిలో దారుణహత్య

» ఓ వ్యక్తిని కత్తితో నరికి చంపిన ఒంటరి మహిళ


చంద్రశేఖర్ హత్యకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ గోవిందరాజు

నరసాపురం రూరల్/మొగల్తూరు, జూలై 20: నరసాపురం మండ లం వేములదీవి గ్రామం సర్దుగొడప ప్రాంతంలో శనివారం దారుణ హత్య జరిగింది. గ్రామానికి చెందిన తిరుమాని చంద్రకళ ఒక వ్యక్తిని కత్తితో నరికి చంపింది. హత్యకు గురైన వ్యక్తి నరసాపురం మండలం చినలంక గ్రామానికి చెందిన షైలా చంద్రశేఖర్(30)గా పోలీసులు గుర్తించారు. సీఐ గోవిందరాజు తెలిపిన వివరాలివి.. సర్దుగొడపలో హంతకురాలు చంద్రకళ ఒంటరిగా నివాసం ఉంటుంది. ఉదయం ఆమె ఇంటి ముందు హత్య జరిగిన ట్లు గుర్తించిన స్థానికులు విషయాన్ని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో చంద్రకళ ఈ హత్య చేసినట్లు తేలిందన్నారు. ఎందుకు హత్య చేసిందన్నది విచారిస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధి నిమిత్తం భార్య గల్ఫ్‌లో ఉంటుంది. తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఎంపీడీవో ఫోన్ కాల్స్‌పై దృష్టి

» ఇంకా దొరకని ఆచూకీ.. కొనసాగుతున్న గాలింపు
» రేవు రికార్డులు స్వాధీనం చేసుకున్న ఉయ్యూరు పోలీసులు



నరసాపురం రూరల్, జూలై 20: ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఆరో రోజు కూడా ఆయన ఆచూకీ చిక్కలేదు. కృష్ణా జిల్లా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడలోని పంట కాల్వలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చేస్తూనే, అదృశ్యానికి ముందు ఎంపీడీవోకు వచ్చిన ఫోన్ కాల్స్‌పై దృష్టి పెట్టారు. ఆ దిశగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఇటు మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించిన కొన్ని రికార్డులను ఉయ్యూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేవుకు సంబంధించిన లావాదేవీలను అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. సిబ్బంది ఇచ్చిన సమాచారం ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. తరచూ ఎంపీడీవోకు కొన్ని ఫోన్ కాల్స్ వచ్చేవని, అవి వచ్చినప్పుడల్లా భయాందోళన చెంది సిబ్బంది పనిచేసే చోటే కూర్చొనేవారని, ఒకసారి అప్పుచేసి పెద్దమొత్తంలో నగదు పంపాడు. దీన్ని గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపడుతున్నారు. ఎందుకు ఫోన్ చేస్తున్నారో.. ఎంపీడీవోను బెదిరించి డబ్బులు గుంజుకోవడం ? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. వచ్చిన ఫోన్ కాల్స్ అన్నీ ఇతర రాష్ట్రాలకు చెందినవిగా గుర్తించి వారి వివరాలను సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. వీరికి, పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి ఏమైనా సంబంధం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైన ఎంపీడీవో అదృశ్యమై వారం రోజులు గడిచినా.. ఇంకా ఆచూకీ చిక్కకపోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

మొగల్తూరు, జూలై 20: దంపతుల మధ్య ఆర్థిక లావాదేవీలతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలివి.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పేరూరు గ్రామానికి చెందిన గురజాడ అప్పారావు(32) మొగల్తూరు మండలంలోని కొత్తపాలెం గ్రామంలో అతడి అత్తవారింటవద్దనే గత పన్నెండేళ్లుగా నివాసం ఉంటున్నాడు. భార్య కువైట్‌లో ఉంటుంది. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరి మధ్య ఆర్థిక అంశాలకు సంబంధించి వివాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన అప్పారావు శనివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మునిసిపల్ కార్మికుడి మృతి


శ్రీను మృతదేహం

తణుకు, జూలై 20 : విధులు నిర్వర్తిస్తున్న ఓ మునిసిపల్ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన తణుకు పట్టణ పరిధిలోని పైడిపర్రులో జరిగింది. పైడిపర్రు శ్మశానం సమీపంలో పారిశుధ్య పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో చిటికెల శ్రీను (42) అక్కడికక్కడే మృతి చెందాడు. జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద అతడి మృతదేహాన్ని సీఐటీయూ నాయకులు వీవీ ప్రతాప్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధనాల వెంకటరావు సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ బి.వి.రమణను బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం, భార్యకు ఉద్యోగం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదినారాయణ బాబు, మందులయ్య, అయ్యప్ప, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా నిధులు రూ.45 వేలు స్వాహా

» వీవోఏ శిరీషపై డ్వాక్రా సంఘ లీడర్ల ఫిర్యాదు


డ్వాక్రా వీవోఏపై ఏపీఎంకు ఫిర్యాదు చేస్తున్న సంఘ లీడర్లు

ద్వారకాతిరుమల, జూలై 20: దొంగతీర్మానాలు తయారు చేసి చెక్కులపై సంతకాలు ఫోర్జరీ చేసి డ్వాక్రా వీవోఏ చిన్ని శిరీష దర్జాగా రూ.45 వేలు స్వాహా చేసిన ఘటన వేంపాడులో జరిగింది. ఈమేరకు శనివారం వెలుగు ఏపీఎం అరవిందమ్మకు డ్వాక్రా గ్రామ సంఘ లీడర్లు కె.నాగశిరోమణి, ఎం.వెంకటలక్ష్మితో పాటు పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. వేంపాడు గ్రామ సంఘ పరిధిలో సుమారు 38 డ్వాక్రా గ్రూపులు ఉండగా ముగ్గురు లీడర్లున్నారు. వీరు మాత్రమే సంఘలావాదేవీలకు తీర్మానం చేసి సంతకాలు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ముగ్గురికి తెలియకుండా వీవోఏ చిన్ని శిరీష వారి సంతకాలు ఫోర్జరీ చేసి భీమడోలు యూనియన్ బ్యాంకు నుంచి రూ. 45 వేలు విత్‌డ్రా చేసింది. విషయం తెలుసుకున్న గ్రామసంఘ లీడర్లు ఆమెను నిలదీశారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారు ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. గ్రామసంఘ లీడర్లుగా తాము ఉన్నప్పటినుండి ఖాతాలో రూ.8లక్షలు వరకూ ఉండేవని ప్రస్తుతం రూ.1.30 లక్షలు మాత్రమే ఉన్నాయని దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వెలుగు ఏపీఎం అరవిందమ్మ మాట్లాడుతూ శిరీషపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానన్నారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం.. ఓ వ్యక్తిపై కేసు

భీమవరం క్రైం, జూలై 20 : గల్ఫ్ పంపిస్తానని డబ్బు తీసుకుని మోసం చేశాడంటూ బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భీమవరం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భూషణం శనివారం తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన సంగాని ఏసుపాదం గల్ఫ్ వెళ్లే ప్రయత్నంలో ఉండగా ఆకివీడుకు చెందిన కారాడి దుర్గారావు గత ఏడాది డిసెంబరు నెల వరకు దఫదఫాలు సుమారు రూ.1.70 లక్షలు తీసుకున్నారు. అప్పటి నుంచి గల్ఫ్ పంపించకుండా మోసం చేశాడని ఏసుపాదం భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

జేసీ ప్రవీణ్ ఆదిత్య బదిలీ



భీమవరం టౌన్, జూలై 20 : జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఎన్నికల సమయంలో ఆయన కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. దాదాపు 4 నెలలు జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. శనివారంనాడు ప్రభుత్వం చేసిన బదిలీల్లో ప్రవీణ్ ఆదిత్యను ఏపీ మారిటైమ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు మావుళ్ళమ్మకు శాకంబరి అలంకారం

భీమవరం టౌన్, జూలై 20 : ఆషాఢమాసం సందర్భంగా మావుళ్ళమ్మ అమ్మవారికి ఆదివారం శాకంబరి దేవిగా అలంకారం చెయ్యనున్నారు. ఇందు కోసం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి రప్పించిన కూరగాయలను, ఆకుకూరలను అలంకారం చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. దండలు గుచ్చేందుకు ఆలయ సిబ్బందితో పాటు భక్తులు సహకారం అందిస్తున్నారు.

నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

భీమవరం అర్బన్, జూలై 20: భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆకుమడులు పూర్తిగా మునిగిపోయి పాడైపోయాయన్నారు. అలాగే అపరాలు, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం స్పందించి వెంటనే ఉచితంగా విత్తనాలు అందించాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని, ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



అజ్జాలమ్మకు శాకంబరి అలంకరణ

ఆకివీడు, జూలై 20 :అజ్జమూరు అజ్జాలమ్మను శాకంబరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ఆచంట, జూలై 20: ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రకారం రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసిరెడ్డి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి మండల కార్యదర్శి కేతా నాగాంజని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దాసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలను గత ప్రభుత్వం ఆపేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 2018 నుంచి ఆగిపోయిన పెండింగ్ క్లయిమ్ నిధులను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

రహదారులు బాగు చేయాలని ఆందోళన

ఆకివీడు, జూలై 20 : తాళ్ళకోడులో నీట మునిగిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని శనివారం కాలనీ వాసులతో సీపీఎం శ్రేణులు ఆందోళన చేశారు. రహదారులతో పాటు కాలనీ కూడా నీట మునిగిందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు పెంకి అప్పారావు, బొక్కా రవి, సందక సూరిబాబు, షేక్ వలీ, బొడ్డుపల్లి రాంబాబు, నక్కాని సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అన్నసమారాధన

నరసాపురం రూరల్, జూలై 20: వేములదీవి గ్రామంలో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అంతకు ముందు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

జర్నలిస్టుల ఆందోళన

నరసాపురం టౌన్, జూలై 20: ఇటీవల విశాఖలో ఎంపీ విజయసాయిరెడ్డి విలేకర్ల సమావేశంలో జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యల్ని ఖండిస్తూ నరసాపురంలో శనివారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆర్డీవో అంబరీష్‌కు వినతిపత్రం అందించారు. విద్యావంతుడైన ఎంపీ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణం వాటిని వెనక్కి తీసుకోవాలని సంఘం నాయకులు ఇజ్రాయిల్, రాంబాబు, మారుతి, సత్తిబాబులు డిమాండ్ చేశారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా



చినఅమిరం హైస్కూల్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సాగిరాజు ప్రసాదరాజు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 20 : చినఅమిరం జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు హామీ ఇచ్చారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేషన్, ప్రసాద్ కన్‌స్ట్రక్షన్ (ప్రాజెక్టు వర్క్స్) లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో చినఅమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సాగి ప్రసాదరాజు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా హెచ్ఎం వి.అనురాధ మాట్లాడుతూ స్వగ్రామంపై అభిమానంతో సాగి రామకృష్ణంరాజు వారసులు తమ పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన

పాలకొల్లు అర్బన్, జూలై 20: బీఆర్ఎంవీఎం హైస్కూల్లో హెచ్ఎంలకు జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను శనివారం పూణెకు చెందిన బృందం పరిశీలించారు. టీచ్ టూల్ ప్రాథమిక లక్ష్యం, మూల్యాంకనం, బోధనల్లో నాణ్యత పాటించడం తదితర అంశాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో గుమ్మళ్ళ వీరాస్వామి, జిల్లా కో ఆర్డినేటర్ టి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల చేతిలో హతమైన కొండ చిలువ



తణుకు, జూలై 20: దువ్వ గ్రామంలో ఇళ్లలోకి సర్పాలు చొరబడుతున్నాయి. గ్రామం ఆనుకుని వయ్యేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనికి తోడు ఎర్రకాలువ వరద నీరు కూడా భారీగా చేరడంతో నీటితో పాటు సర్పాలు గ్రామాల్లోకి వస్తున్నాయి. శనివారం దువ్వ సజ్జ వీధిలో ఓ ఇంటి అరుగు కింద భారీ కొండ చిలువ చేరడంతో స్థానికులు భయాందోళనకు గురై దానిని హతమార్చారు.

రోగికి మానవత చేయూత

తణుకు, జూలై 20: కిడ్నీ, లివర్ వ్యాధికి గురై రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాదాసు తులసీ దుర్గ సాయికి తణుకు మానవత ఆధ్వర్యంలో రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ అధ్యక్షులు కఠారి శారదాదేవి, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, బోయపాటి రామలక్ష్మి, ఆనందం మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బీవీరాజు కళాశాలలో అచీవర్స్ డే

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 20 : బీవీరాజు డిగ్రీ కళాశాలలో 2021-24 విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు అచీవర్స్‌డే నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్‌కె రాజు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 217 మంది ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించారన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 20 : పట్టణంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఎస్సీ హాస్టళ్లలో తాగునీరు సదుపాయం సరిగ్గా లేదని విద్యార్థులు అనారోగ్యాలకు గురువుతున్నారని అలాగే జీవో నెంబర్ 35 రద్దు చేసి ఎయిడెడ్ విద్యా సంస్థలకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల బకాయిలు క్లియర్ చేయాలని వినతిపత్రం అందజేశారు.









కుప్పనపూడిలో నీట మునిగిన వరిని చూపిస్తున్న రైతులు... పెదతాడేపల్లి వద్ద చెరువు నిండి పొంగడంతో రోడ్లపై పారుతున్న వరద నీరు..వీరవాసరంలో ఇళ్లను చుట్టుముట్టిన నీటిని ఇంజన్‌తో తోడుతున్న దృశ్యం.. భీమవరంలో వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

ముంపులోనే వరి పొలాలు

పొంగిపొర్లుతున్న డ్రెయిన్‌లు.. రహదారులు ఛిద్రం



బ్రాహ్మణ చెరువు వద్ద రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



ఉండిలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు



బీ.కొండేపాడులో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి

ఆచంట, జూలై 20: భారీ వర్షాలు కారణంగా మండలంలో వరి నాట్లు సుమారు 1200 ఎకరాల్లో ముంపునకు గురి కాగా 125 ఎకరాలకు సంబంధించి నారుమడులు పూర్తిగా నీట మునిగాయి. దీంతో పలు చోట్ల పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీనికి తోడు మండలంలో నక్కల తాడేరు, కొరాలపర్రు, డ్రెయిన్‌లు పొంగి పొర్లుతున్నాయి. కొడమంచిలిలో ఉన్న తాడేరు డ్రెయిన్‌లు పొంగి పొర్లుతుండటంతో దానికి తోడు గుర్రపుడెక్క కూడా నిండి పోవడంతో గత కొన్ని రోజులుగా స్థానికులు గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. శనివారం కూడా వర్షం పడుతూనే ఉంది. మండలంలో పలు కాలనీలు నీట మునిగాయి.

ఆకివీడు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు అల్లాడుతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు ఇలానే ఉంటే మరలా నారుమడులు వేసుకోవడంతో పాటు అదనపు ఖర్చు తప్పదంటున్నారు. మండలంలో నారుమడులు 45 ఎకరాలు, ఊడ్పులు ఊడ్చిన పొలాలు 245 ఎకరాలు నీట మునిగాయని వ్యవసాయాధికారి ప్రియాంక తెలిపారు. అదే విధంగా జాతీయ, సీసీ రోడ్లు కాలువలు, చెరువులను తలపిస్తున్నాయి.

నరసాపురం రూరల్: మండలంలోని 195 హెక్టార్లలో ఆకుమడులు ఉండగా 123 హెక్టార్లలో ఆకుమడులు భారీ వర్షాలకు నీట మునిగినట్లు ఏవో జాన్సన్ తెలిపారు. 26 హెక్టార్లలో రైతులు ఊడ్పులు చేయగా 21 హెక్టార్ల వరకు ముంపునకు గురైనట్టు తెలిపారు. సుమారు 2800 మంది రైతులు ఈ ఏడాది సార్వా సాగు మొదలుపెట్టారన్నారు. చేనులో వర్షం నీరు తగ్గిన తరువాత నష్టంపై సర్వే చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తణుకు: పట్టణంలో పలు పల్లపు ప్రాంతాల్లోకి వాన నీరు చేరడంతో ఆయా వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సజ్జాపురం 28వ వార్డులో పలుచోట్ల వర్షం నీరు రోడ్లపైకి వచ్చింది.

పాలకొల్లు అర్బన్ / పాలకొల్లు రూరల్: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలు పొంగి పొర్లి రహదారులపైకి చేరుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పీపీ రోడ్డు పూర్తిగా గోతులు పడిపోవడంతో వర్షపునీరు నిలిచింది. రైల్వే గేటుకు ఇరువైపులా గోతులు పడి ప్రయాణికులు, వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేటలోని 5రోడ్ల మోకాలు లోతు వర్షపు నీరు నిలిచింది. మండలంలో వర్షాలతో పాటు ఈదురుగాలులు కూడా పెద్దగా వీయడంతో పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు తెగిపోవడం, చెట్లు విరిగి పడ్డాయి. బల్లిపాడు, చింతపర్రు, ఆగర్తిపాలెం తదితర గ్రామాల్లో ఈపరిస్థితి నెలకొంది. మొత్తంగా లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగినట్టు విద్యుత్ శాఖ ఏఈ వీవీ సత్యనారాయణ తెలిపారు.

శాస్త్రవేత్తలు వరి చేల పరిశీలన

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ గిరిజారాణి, ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు, డాక్టర్ ఎం వెరోనికా, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు ఎ పార్వతి తదితరులు లంకలకోడేరు, దగ్గులూరు, ఎస్‌చిక్కాల, తదితర గ్రామాల్లో వరి చేలను పరిశీలించారు. నారుమడి దెబ్బతిన్న రైతులు తిరిగినారు పోసుకోవాలని సూచించారు. ఎరువులు ఎలా వాడాలో ఏరకం విత్తనాలు పోసుకోవాలి అన్న అంశాలను రైతులకు వివరించారు.

ఇరగవరం: మండలంలోని ఇరగవరం, అర్జునుడుపాలెం, కావలపురం, గోటేరు, కె. ఇల్లిందలపర్రు, రేలంగి గ్రామాల్లో నీటి మునిగిన పొలాలను మండల వ్యవసాయాధికారి వై. రాఘవేంద్రరావు శనివారం పరిశీలించారు. చేలలో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని, నీటిని బయటకు పంపిన తర్వాత ఎకరాకు 20 కేజీల యూరియా, 10-20 కేజీల పొటాష్‌ను కలిపి చేలలో చల్లుకోవాలని సూచించారు. నీట మునిగిన చేలలో తెగుళ్ళు ఆశించకుండా ఉండడానికి వ్యాలిడామైసిన్ అనే మందు ఎకరానికి 400 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలని తెలిపారు.

మొగల్తూరు: మొగల్తూరు మండలంలో మూడు రోజులుగా సుమారు 108.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, రామన్నపాలెం పంచాయతీ పరిధి అడవిపర్రలలో ఇటీవల వేసిన ఆకుమడులులతో పాటు ముందుగా ఊడ్చిన చేలల్లో మోకాలు లోతులో నీరు నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. మొగల్తూరు, పేరుపాలెం, కొత్తకాయలతిప్ప, పేరుపాలెం సెంటర్‌తో పాటు పలు కాలనీల్లో ముంపునీటిని ఎక్స్‌కవేటర్‌తో డ్రెయిన్‌లు తవ్వించి ముంపునీటిని మళ్ళిస్తున్నారు. మొగల్తూరు-వెంప రహదారి గోతులు మయంగా ఉండటంతో కురిసిన వర్షాలకు ఆగోతులు నీటితో నిండిపోవడంతో ఛిద్రంగా మారింది. పేరుపాలెం, కాళీపట్నం గ్రామాల్లోనూ వర్షాలకు రహదారులు అధ్వానంగా మారాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం వరకూ సముద్ర వేటకు వెళ్ళరాదని హెచ్చరికలు జారీ చేసినట్టు తహసీల్దార్ భాస్కర్ సూచించారు.

అత్తిలి: వరిఘేడు, తిరుపతిపురం, ఆరవల్లి, దంతుపల్లి గ్రామాల్లో వరి చేలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. అధిక వర్షాల వలన అత్తిలి మండలంలో 2600 ఎకరాల్లో వరి పంట మునిగిపోయిందని, 120 ఎకరాల్లో నారుమడులు నీట మునిగాయని వ్యవసాయాధికారి టీకే రాజేష్ తెలిపారు.

పాలకోడేరు: భారీ వర్షాలకు నీటమునిగిన వరిపంట పొలాల పై నీరుబయటకు తోడుకుని పంట పొలంపై కార్బనిజం మందును పిచికారి చేసుకుని పంటలను రక్షించుకోవాలని భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్, భీమవరం డీఆర్‌సీ వ్యవసాయాధికారి బాలనాగేశ్వరమ్మ అన్నారు. శనివారం గరగపర్రు, మొగల్లు, కోరుకల్లు, మొగల్లు శివారు గుత్తివారిపాలెం పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ నీటమునిగిన పంటపొలాలు, నారుమడుల పై 2కేజీల ఎంటపీ, ఒక కేజీ యూరియా చల్లుకుని నారుమడులను రక్షించుకోవచ్చని అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే నారుమడుల్లో ఎక్కడైతే ముంపుకు గురయ్యాయో వాటి చోట స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పోడూరు: మండలంలో వరినాట్లు నీటమునిగాయి. మరో రెండు రోజులు వరకూ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోడూరు, కవిటం, మినిమించిపాడు, పండితవిల్లూరు గ్రామాల్లో నీటమునిగిన వరినాట్లను మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. వర్షాల వల్ల 650ఎకరాల్లో వరినాట్లు, 100 ఎకరాల్లో నారుమడులు పూర్తిగా నీటమునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏవో తెలిపారు.

ఉండి: ఉండి పంటకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉండి తోట వద్ద పంట కాలువ అవతల గట్టు బలహీనంగా వుండడంతో ఆ ప్రాంతం నుంచి ఎస్‌సీ, బీసీ కాలనీలలోకి పంటకాలువ నీరు చేరింది. ఉండి పంటకాలువపై ఉండి అక్విడెక్టు వద్ద అవతల వున్న నూతన బ్రిడ్జి వద్ద నుంచి చెరువుగట్టుపాలెం వరకు పంటకాలువ గట్లు బలహీనంగా వున్నాయి. ఎస్ఆర్‌పిఅగ్రహారం ఎస్‌సి పేట వద్ద పంటకాలువ గట్టు కోతకు గురై పంటకాలువ నీరు ఆకాలనీలలోకి చేరింది. స్థానికులు అప్రమత్తమై సహాయకచర్యలలో నిమగ్నమయ్యారు.

20 వేల ఎకరాలు మునక: బొలిశెట్టి

పెంటపాడు, జూలై 20: వర్షాల కారణంగా నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలో ముంపునకు గురైన పొలాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జీతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టంపై ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్‌లకు తగు సూచనలిచ్చారన్నారు. బాబ్జి మాట్లాడుతూ నాట్లు పూర్తి చేసిన రైతులు ఇప్పటికే రూ. 10 వేల నుంచి 15 వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలో పంటనష్టంపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సీఎం దృష్టికి తీసుకువెళ్తారన్నారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, కోలా మార్కండేయులు, బోరాడ శ్రీనివాస్, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారథి పాల్గొన్నారు.

యనమదుర్రుకు రెండో ప్రమాద హెచ్చరిక

భీమవరం టౌన్, జూలై 20: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరంలోని 26,28,38,39 వార్డుల్లోని ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే అంజిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన యనమదుర్రు డ్రెయిన్ కాలువ ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్నదని, ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక కూడా ఇవ్వడం జరిగిందని, మూడో ప్రమాద హెచ్చరిక రాక ముందే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చేపల మార్కెట్ వద్ద యనమదుర్రు వంతెన నుంచి ప్రకాశం ప్రకాశం చౌక్ వరకు ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని మునిసిపల్ కమిషనర్ శ్యామలకు సూచించారు. ముందుగా లంకపేట, దుర్గాపురం,పసిమొగ్గల పాఠశాల ఏరియాపలు ప్రాంతాలను పరిశీలించారు. కాగా బీవీరాజు విగ్రహ సమీపంలో ఉన్న గట్టును పటిష్ట చర్యలను అధికారులు చేపట్టారు.

జాయింట్ కలెక్టర్ పరిశీలన

యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి ఉధృతి పెరిగి పట్టణంలోని పలువార్డుల్లో నీరు చేరిన నేపథ్యంలో శనివారంనాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదిత్యప్రవీణ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఇప్పటి వరకు తీసుకున్న జాగ్రత్తల గురించి మునిసిపల్, ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ ఇంజన్‌లను ఏర్పాటుచేసిన నీటినిబయటకు తోడాలన్నారు.

బాధితులకు భోజనాలు అందజేత

ముంపు బాధితులకు సహాయ సహకారాలను అందించాలని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి అన్నారు. దుర్గాపురం, లంకపేటలో నిరాశ్రయులకు భోజనాలు అందించారు.

పెంటపాడు: ఎడతెరిపిలేని వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో నాట్లు పూర్తి చేస్తున్న 11,420 ఎకరాల్లో 5 వేల ఎకరాలకు పైగా ముంపునకు గురైనట్టు అధికారులు చెబుతున్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు: ఎమ్మెల్యే రఘురామ

ఉండి జూలై 20:యనమదుర్రు డ్రెయిన్ వద్ద యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశించారు. శనివారం యండగండిలోని ఖైపా వంతెన వద్ద నుంచి యనమదుర్రు డ్రెయిన్ ఉధృతిని, ఉల్లంట్ల వద్ద స్లూయిజ్‌కు సమీపంలో బలహీనంగా వున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందనవసరంలేదన్నారు. అధికారులు, స్థానికులు యనమదుర్రు డ్రెయిన్ గట్టు వెంబడి గస్తీ తిరుగాలని ఆయన సూచించారు. కోరుకొల్లు, యండగండి, ఖైపా, గరగపర్రు గ్రామాలకు వరద ముప్పు వుందన్నారు. ఈరాత్రి వరద ఉధృతి పెరిగితే అందుకు తగిన విధంగా ఇసుక బస్తాలను సిద్ధం చేసే పనులలో అధికారులు వున్నారన్నారు.

రహదారిపై కూలిన చెట్టు

పెనుమంట్ర, జూలై 20 : మార్టేరు- తాడేపల్లిగూడెం రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. బ్రాహ్మణ చెరువు సివిల్ సప్లై గొడౌన్ ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న నిద్రగన్నేరు చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పెనుమంట్ర గ్రామపంచాయతీ సిబ్బంది జోరు వర్షంలో ఎక్స్‌కవేటర్‌తో భారీ వృక్షాన్ని అడ్డు తొలగించారు.

రోటరీక్లబ్ అధ్యక్షురాలిగా సత్యవతి



నరసాపురం, జూలై 20: నరసాపురం రోటరీక్లబ్ అధ్యక్షురాలిగా మళ్లీ గన్నాబత్తుల సత్యవతి నియమితులయ్యారు. ప్రస్తుతం క్లబ్ అధ్యక్షురాలిగా ఆమె కొనసాగుతున్నారు. గత ఏడాది ఆమె పనితీరుకు క్లబ్‌కు 13 అవార్డులు దక్కాయి. దీంతో మరోసారి సత్యవతికే బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులిచ్చారు. క్లబ్ కార్యదర్శిగా బొమ్మిడి సూర్యకుమారి, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. వీరంతా ఆదివారం పట్టణంలోని రోటరీక్లబ్ భవనంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. సత్యవతిని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, క్లబ్ సభ్యులు అభినందించారు.

సబ్ జైలు తనిఖీ

నరసాపురం, జూలై 20: నరసాపురం సబ్ జైలును జిల్లా అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. సబ్ జైలులో వంటశాల, ఆహార పదార్థాలను జైలు ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ముద్దాయిల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకోలేని వారు జైలు విజిటింగ్ లాయర్‌ని సంప్రదించి ఉచిత న్యాయ సహయం పొందాలని సూచించారు. సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అధాలత్‌లో రాజీ పడతగిన క్రిమినల్ కేసులలో ఉన్న జైలు ముద్దాయిలు కూడా సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. జైల్ విజిటింగ్ లాయర్ కె.శిరీష, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.చిట్టి పద్మజ, సబ్ జైల్ పర్యవేక్షణ అధికారి టి.అప్పారావు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో డెక్క తొలగింపు



పాలకోడేరు, జూలై 20: పాలకోడేరు నుంచి గొల్లలకోడేరు వైపు వెళ్ళే యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జి వద్ద కొన్ని నెలలుగా పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్తాచెదారాన్ని అధికారులు శనివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. కొన్ని నెలలుగా యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జి వద్ద గుర్రపు డెక్క, చెత్తాచెదారం పేరుకుపోయి బ్రిడ్జిని బలంగా తాకేసి ఉంది. ఇది నీటి ప్రవాహాన్ని అడ్డుకున్నది. దీనితో అధికారులు చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు.

బ్యాంక్ అధికారుల వితరణ



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 20: తాడేపల్లిగూడెం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న రుద్రభూమికి బ్యాంక్ ఆఫ్ బరోడా ఫౌండేషన్ డే సందర్భంగా శనివారం బ్యాంక్ అధికారులు విద్యుత్ ఉపకరణాలు అందించారు. తాడేపల్లిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి రూ.25 వేలు విలువ చేసే రెండు గీజర్లు, మూడు సీలింగ్ ఫ్యాన్లు, పెదతాడేపల్లిగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా తరఫున రూ. 10 వేలు విలువ చేసే ఫ్రిజ్‌ను అందజేశారు. బ్యాంక్ మేనేజర్లు ఎం.కేదారి, కరుణాకర్, మానవత నాయకులు పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెస్ కిట్ల పంపిణీ

భీమవరం అర్బన్, జూలై 20: చదరంగ క్రీడ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, సహనం అలవడతాయని డీఎన్ఆర్ స్కూల్ జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు అన్నారు. అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా శనివారం డీఎన్ఆర్ స్కూల్‌లో కేక్‌ను కట్ చేసి ప్రతిభగల విద్యార్థులకు ఇంటర్నేషనల్ చెస్ కిట్‌లను అందజేశారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల మునక



శేరేపాలెంలో జగనన్న కాలనీ



రామచంద్రపురంలో నీట మునిగిన జగనన్న కాలనీ

పెంటపాడు, జూలై 20: రామచంద్రపురంలో యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి కారణంగా సమీపంలోని జగనన్న కాలనీ ముంపునకు గురైంది. రెండు రోజులుగా కాలనీలో నీరు చేరడంతో చిన్నపిల్లలతో ముంపు నీటిలో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు నీరు బయటకు వెళ్ళే మార్గం చూడాలని వేడుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో హడావుడి గా జగనన్నకాలనీలో ఇళ్ళను నిర్మించారే తప్పా వారికి సరిపడ వసతులు మాత్రం సమకూర్చలేదు. ఇంటి నిర్మాణం చేసుకోపోతే మీ స్థలం వేరే వారికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురి చేయడంతో లబ్ధిదారులు అప్పు చేసి హడావిడిగా ఇళ్ల నిర్మించుకున్నారు. వసతులు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

మొగల్తూరు: శేరేపాలెం జగనన్న కాలనీలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలనీలో కనీసం రహదారులు లేకపోవడం, ఇతర సదుపాయాలు లేకపోవడంతో వర్షం నీరు ఇళ్ళ చుట్టూ నిలిచిపోవడంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు తెలిపారు. కాలనీలో వర్షాలు కారణంగా నీరు నిల్వ ఉండిపోవడంతో దోమల బెడద పెరిగి కాలనీ వాసులు, చిన్నారులు రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

పశుపోషణకు ప్రభుత్వ రాయితీలు

యలమంచిలి, జూలై 20: పశుపోషణకు ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ కోరారు. శిరగారపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ చంద్రపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గడ్డి విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందన్నారు. ప్రభుత్వం కొత్తగా మనీగోకులం పథకాన్ని చేపట్టిందని ఈపథకంలో 90శాతం సబ్సిడీపై షెడ్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

పెంటపాడు, జూలై 20: బీజేపీని మరింత బలోపేతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ కోరారు. అలంపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముదునూరు కాంగ్రెస్ నాయకుడు పాతగొలుసుల జయరాజు బీజేపీలో చేరారు. తనుబుద్ది భోగేశ్వరరావు, నరిసే సోమేశ్వరరావు, కర్రి వెంకటరెడ్డి, కొండేపాటి వెంకటేశ్వరావు, ఇమ్మంది శ్రీను, ఆరాధ్యుల ఆంజి తదితరులు పాల్గొన్నారు.

దత్తసాయి ఊరేగింపు



ఉండి జూలై 20: శ్రీలక్ష్మీ గణపతి దత్తసాయి ఊరేగింపు వైభవంగా జరిపారు. శనివారం గురుపూర్ణిమ పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేషపూజలు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, కోలాటం, సాయి నామసంకీర్తనల మధ్య స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

స్కాలర్ షిప్‌ల పంపిణీ

కాళ్ల(ఉండి) జూలై 20:పేద విద్యార్థులకు అండగా నిలవడమే సాయిబాబా ట్రస్ట్ బోర్డు ధ్యేయమని చైర్‌పర్సన్ తోట అనంతలక్ష్మీసత్యవతిదేవి అన్నారు. శనివారం కాళ్ల మండలం సీసలిలోని సాయిబాబా ఆలయంలో 150మంది సేవకుల పిల్లలకు రూ.3లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం గురుపౌర్ణమి పూజలు జరుగుతాయన్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

గణపవరం, జూలై 20: ముంపునకు గురైన వరి చేలను కాపాడుకునేందుకు వ్యవసాయాధికారుల సూచనలను అధికారులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గణపవరం మండలంలోని చిలకంపాడు, సీహెచ్ అగ్రహారం, పిప్పర గ్రామ ఆయకట్టులో నీటమునిగిన వరి చేలను ఆయన శనివారం పరిశీలించారు. మండలంలో 11,713 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంది. ఇప్పటికి 2,036 ఎకరాల్లో నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయన్నారు. మిగిలిన పొలాలకు వేయాల్సిన నారుమళ్లు నీటి ముంపునకు గురైందని అధికారులు తెలిపారు. పొలాల్లో వరి నాట్లు తేలిపోయే ప్రమాదం ఉందని రైతులు అధికారులకు మొరపెట్టుకోవడంతో వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటను కాపాడుకోవాలని సూచించారు. మండల ఏవో వైవీఎస్. ప్రసాద్, తహసీల్దార్ రాంబాబు, వీఆర్వో కేశవమూర్తి, కెనడి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, వారి వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వరద ముంపు గ్రామాలైన పెదతాడేపల్లి, చినతాడేపల్లి, కొండ్రుపోలు, మాధవరం, నందమూరు, నవాబ్‌పాలెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఏడీఏ మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి: జిల్లాలో కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో నాట్లు వేయడానికి సిద్ధపడుతున్న రైతులు తమ నాట్లును కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ఉండిలో నీట మునిగిన వరిపొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలలోని వరిపొలాలు అధిక మొత్తంలో నీట మునిగాయన్నారు. రైతులంతా వర్షం తగ్గిన వెంటనే వరి పొలాల్లో నీరును బయటకు పంపేందుకు తీగిన చర్యలు తీసుకోవాలన్నారు.